క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

భువనగిరి : పట్టణంలోని వినాయక చౌరస్తా నుంచి ఏరియా ఆస్పత్రి వరకు శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్ శాఖ పట్టణ ఏఈ సాయికృష్ణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కొత్త ఎల్‌టీ లైన్ వేడయంతో పాటు డీటీఆర్ మార్పు చేసే పనుల్లో భాగంగా ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు బస్టాండ్, ప్రిన్స్‌కార్నర్, ఏరియా ఆస్పత్రి, మీనానగర్‌లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనున్నట్లు తెలిపారు. వినియోగదారులు సర్వీస్‌లను కొత్త ఎల్‌టీ లైన్‌కు మార్పు చేసేందుకు కొత్త సర్వీస్ వైరు సిద్దంగా ఉంచుకోవాలని కోరారు. అలాగే 33/11కేవీ ఐడీఏ సబ్‌స్టేషన్ మెయింటెనేన్స్‌లో భాగంగా సింగన్నగూడెం, టీచర్స్ కాలనీ,రాంనగర్ నల్లగొండ రోడ్డు(అండర్‌పాస్ ప్రాంతం), ఇండస్ట్రీయల్ ఏరియా, స్వర్ణగిరి, ఎల్‌బీనగర్, హౌసింగ్‌బోర్డు కాలనీ, జలీల్‌పూరలో మధ్యాహ్నం 12.30 గంటల నుంచి 2గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని తెలిపారు.

వృద్ధులను నిరాదరిస్తే చర్యలు తప్పవు

భువనగిరి : వయోవృద్ధులను నిరాదరిస్తే చర్యలు తప్పవని న్యాయవాది నాగరాజు అన్నారు. గురువారం మండలంలోని చీమలకొండూరు గ్రామంలో గల జోసఫ్ మేరీ జీసస్ ఆశ్రమంలో ప్రపంచ వయోవృద్ధుల దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొని ఆయన మాట్లాడారు. అర్హులైన పేదలు, వృద్ధులకు న్యాయ సేవా అధికార సంస్థ ద్వారా ఉచితంగా న్యాయ సాయం అందించనున్నట్లు తెలిపారు. వయోధికులు ఎలాంటి సమస్యలు ఉన్న న్యాయం కోసం టోల్ ఫ్రీ నంబర్ 15100ను సంప్రదించాలన్నారు. ఈ సమావేశంలో లీగల్ డిఫెన్స్ కౌన్సిల్స్ సాయి శ్రీనివాస్, సీనియర్ సిటిజన్ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి జంపాల అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గ సాధనకు ఉద్యమించాలి

రామన్నపేట : రామన్నపేట నియోజకవర్గ సాధనకు సమష్టిగా ఉద్యమించాలని బీజేపీ రాష్ట్రకమిటీ సభ్యుడు దాసరి మల్లేశం పిలుపునిచ్చారు. గురువారం రామన్నపేటలో నిర్వహించిన ఆపార్టీ ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. త్వరలో నియోజకవర్గాల పునర్విభజన జరుగనున్న నేపథ్యంలో గతంలో రద్దయిన రామన్నపేట నియోజకవర్గం పునరుద్ధరణకు రాజకీయాలకు అతీతంగా ప్రయత్నించాలని కోరారు. రామన్నపేట రైల్వే స్టేషన్‌లో పలు రైళ్లు ఆపేలా కృషి చేస్తానన్నారు. ఈ సమావేశంలో కన్నెకంటి వెంకటేశ్వరాచారి, కొమ్ము యాదయ్య, సిందం లింగయ్య, కట్కూరి భిక్షపతి, కూనూరు సుధాకర్, నకిరేకంటి సుదర్శన్, గుండాల అంజయ్య, ఏలూరి రవి, లక్ష్మణ్, శుభకోటి శశికృష్ణాచారి, ఊట్కూరి మల్లేశం పాల్గొన్నారు.

పనుల జాతరను విజయవంతం చేయాలి

యాదగిరిగుట్ట రూరల్: పనుల జాతరను విజయవంతం చేయాలని ఎంపీడీఓ నవీన్ కుమార్ అన్నారు. మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్‌లు, టెక్నికల్ అసిస్టెంట్‌లతో సమీక్షా సమావేశాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో ఉపాధిహామీ ద్వారా నిర్వహించే ఈ పనుల జాతరలో ఎక్కువ పనులను చేయించాలని ఆదేశించారు. పారిశుద్ధ్య సముదాయాలు, గ్రామీణ రహదారుల నిర్మాణాలు, సీసీ రోడ్లు, కోళ్ల, గొర్రెల షెడ్లు, వ్యవసాయ బావులు, కంపోస్టు గుంతలు, నర్సరీలు, కుంటలు,ఇతర అభివృద్ధి పనులను ప్రారంభించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ నర్సయ్య, రాజశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

భవిత కేంద్రానికి శంకుస్థాపన

భూదాన్‌పోచంపల్లి: పట్టణ కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాల ఆవరణలో నిర్మిస్తున్న భవిత కేంద్ర భవన నిర్మాణానికి గురువారం ఎంఈఓ పి. ప్రభాకర్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం సమగ్ర శిక్ష అభియాన్ పథకం కింద భవిత కేంద్ర భవానికి రూ.9లక్షల నిధులు మంజూరు చేసిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం పుష్పలత, ప్రత్యేక ఉపాధ్యాయులు బోయ శ్రీనివాసులు, ఐఈఆర్పీ సుధామణి, అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

శాంతియుతంగా నిర్వహించుకోవాలి

వలిగొండ : రాబోయే వినాయక చవితి గణేశ్ నవరాత్రి ఉత్సవాలను ప్రజలు శాంతియుతంగా నిర్వహించుకోవాలని స్థానిక ఎస్ఐ యుగేందర్ కోరారు. గురువారం స్థానిక పోలీస్ స్టేషన్లో అన్ని కులాల వారితో ఏర్పాటు చేసిన శాంతి కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. మండలకేంద్రంతో పాటు మండలంలోని వివిధ గ్రామాల్లో నిర్వహించే గణేశ్ చతుర్థి పండుగకు మంటపాలు ఏర్పాటు చేసుకుని నిర్వాహకులు పోలీసుల అనుమతి తీసుకోవాలని, ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులకు సహకరించాలని కోరారు.

అందని ఇందిరమ్మ ఇళ్ల బిల్లులు

- అప్పులు తెచ్చి నిర్మాణాలు
- బిల్లుల కోసం ఎదురుచూపులు
- సాంకేతిక సమస్యలు అని పేర్కొంటున్న అధికారులు

సంస్థాన్ నారాయణపురం : కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం ముందుకు సాగడం లేదు. సాంకేతిక సమస్యలా.. అధికారుల నిర్లక్ష్యమా కాని ఇందిరమ్మ లబ్ధిదారులుకు బిల్లులు అందడం లేదు. కొంత లబ్ధిదారులు ఇంటి నిర్మాణం పనులు నిలిపివేస్తే, కొంత మంది అప్పులు తెచ్చి నిర్మాణం పనులు చేస్తున్నారు. ప్రభుత్వం ప్రతి సోమవారం బిల్లు చెల్లిస్తామని ప్రకటిస్తే, వాస్తవ పరిస్థితిలుకు భిన్నంగా ఉన్నాయి. పలు సోమవారాలు గడుస్తున్న బిల్లులు అందడం లేదు. సంస్థాన్ నారాయణపురం మండలానికి 473ఇందిరమ్మ ఇళ్లు మంజూరయ్యాయి. ఇందులో 302ఇళ్లు బేస్‌మెంట్ దశ వరకు పూర్తి కాగా, 30 ఇళ్లు గోడల వరకు, 4ఇళ్లు స్లాబ్ వరకు పూర్తయ్యాయి. సుమారు 50మంది లబ్ధిదారులుకు ఇప్పటి వరకు బిల్లులు రాలేదు. బిల్లుల కోసం అధికారుల చుట్టూ తిరుతుగున్నారు.



పుట్టపాకలో బేస్‌మెంట్ లెవల్‌లో ఉన్న ఇందిరమ్మ ఇల్లు

అప్పులు చేసి నిర్మాణాలు

ఇందిరమ్మ ఇల్లు మంజురు కావడంతో సంతోషం పడ్డ లబ్ధిదారులు ఇంటి పనులు చేపట్టారు. కొంత మంది తమ పాత ఇంటిని కూల్చివేసి నిర్మాణ పనులు మొదలు పెట్టారు. బేస్‌మెంట్ లెవల్ వరకు రావడంతో అధికారులు ఫొటో తీసుకున్నారు. సోమవారం రోజు బిల్లు వస్తుందని లబ్ధిదారులుకు చెప్పారు. కాని సోమవారాలు పోతున్న బిల్లులు రావడం లేదు. అధికారులు చూట్టు తిరుగుతున్న లబ్ధిదారులుకు వివిధ స్థాయి ఆధికారుల వద్ద పెండింగ్ ఉందని చెబుతుండటంతో ఏం చేయాలో తెలియక ఇబ్బందులు పడుతున్నారు. బిల్లు వస్తుందా, రాదా అని అందోళన పడుతున్నారు. కొంత మంది అప్పులు చేసి నిర్మాణం పనులు కొనసాగిస్తుండగా, మరికొంత మంది బేస్‌మెంట్ వరకు కట్టి నిర్మాణం నిలుపుదల చేస్తున్నారు.

సాంకేతిక సమస్యలే కారణామా

ఇందిరమ ఇళ్ల బిల్లు చెల్లింపులో సాంకేతిక సమస్యల కారణంగా రావడం లేదని ఆధికారులు చెబుతున్నారు. లబ్ధిదారులు బ్యాంకు ఖాతా నంబర్, ఐఎఫ్‌సీ కోడ్ తప్పుగా ఉన్న, ఆధార కార్డులో లోపాలు ఉన్న బిల్లు చెల్లింపులో అలస్యమవుతున్నట్లు గుర్తించారు. లోపాలు గుర్తించి, వాటిని సరిచేసి బిల్లు చెల్లింపులు చేయ్యాలని లబ్ధిదారులు కోరుతున్నారు.

అప్పులు చేసి ఇల్లు కడుతున్న



మూడు నెలలు క్రింద ఇందిరమ్మ ఇల్లు మంజురు కావడంతో, అప్పులు తెచ్చి ఇంటి నిర్మాణ పనులు చేపట్టాను. బేస్‌మెంట్ వరకు నిర్మాణం పూర్తి చేసి నెల అవుతుంది. కాని ఇప్పటి వరకు బిల్లు రాలేదు. దీనిపై ఎంపీడీఓ కార్యాలయంలో గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేశాను. టోల్ ఫ్రీ నంబర్‌కు కాల్ చేసి కూడా ఫిర్యాదు చేశా. సోమవారాలు వచ్చిపోతున్న బిల్లు రావడం లేదు. దీంతో ఇంటి నిర్మాణ పనులు ఆపాను. – చిట్టిప్రోలు రమేష్, పుట్టపాక

బిల్లు వెంటనే చెల్లించాలి



ఇందిరమ్మ ఇల్లు మంజురు కావడంతో ఇంటి పని మొదలు పెట్టా. బేస్‌మెంట్ లెవల్ పూర్తికావడంతో బిల్లు రాకపోవడంతో ఇంటి నిర్మాణం నిలిపివేశాను. అధికారులుకు దృష్టికి తీసుకెళ్తే సమస్యను గుర్తించి, పరిష్కరించి బిల్లు చెల్లిస్తామన్నారు. బిల్లు వెంటనే చెల్లించాలి. – గజం శ్రవణ్, పుట్టపాక

వారంలోపు బిల్లు జమ



సుమారు 50మంది ఇందిరమ్మ ఇల్లు లబ్ధిదారులుకు బిల్లు జమ కాలేదు, అధార్, బ్యాంకు ఖాతా వివరాలు లోపాలను సరిచేసి వారం లోపు బిల్లులు జమ చేస్తాం. ముందుగా వారి ఖాతాలో రూ.1జరిగింది. త్వరలో రూ.1లక్ష జమ చేస్తాం. ఇల్లు మంజూరయినప్పటికీ కట్టలేని వివరాలు ఉన్నాతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం. – ప్రమోద్‌కుమార్, ఎంపీడీఓ

నెరవేరిన పేదల సొంతింటి కల

- భువనగిరి ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌రెడ్డి

భువనగిరి : ఇందిరమ్మ ఇళ్లతో పేదల సొంతింటి కల నెరవేరిందని ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్ రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని బండ సోమారంలో ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశ కార్యక్రమంలో ఆయన పాల్గొని లబ్ధిదారులకు పట్టువస్త్రాలను అందజేశారు.అనంతరం ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్ లక్షల కోట్లు ఖర్చు చేసి నిర్మించిన ప్రాజెక్టులు శిథిలమవుతున్నాయన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం బస్వాపురం రిజర్వాయర్ ముంపు బాధితులకు నష్టపరిహారం చెల్లించడంలో జాప్యం చేసిందన్నారు కాంగ్రెస్‌పార్టీ అధికారంలోకి రాగానే రూ. 30 కోట్లు చెల్లించడం జరిగిందని మరో రూ. 70 కోట్లు చెల్లించే కార్యక్రమం కోసం ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. బీఎస్ తిమ్మాపురం గ్రామం ఖాళీ అయితే రిజర్వాయర్‌లో నీటిని నింపడం ద్వారా భువనగిరి, వలిగొండ, రామన్నపేట, చిట్యాల మండల పరిధిలో సుమారు 70వేల ఎకరాలకుసాగు నీరు అందుతుందన్నారు. అనంతరం మండలంలోని బండసోమారం, తుక్కాపురం, గౌస్‌నగర్, ఎర్రంబెల్లి, నమాత్‌పల్లి గ్రామాలలో హెచ్‌డీఎంఏ ద్వారా మంజూరైన నిధులతో పలు అభివృద్ధిపనులకు శంకు స్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ భువనగిరి నియోజకవర్గ నాయకులు పచ్చిమట్ల శివరాజ్‌గౌడ్, పార్టీ మండల కమిటీఅధ్యక్షుడు ఎలిమినేటి కృష్ణారెడ్డి, పాశం శివానంద్, నాయకులు నానం కృష్ణ, శివ పాల్గొన్నారు.



వలిగొండ : ఇందిరమ్మ ఇంటి గృహ ప్రవేశంలో ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌రెడ్డి

వలిగొండ : మండలంలోని నాతాళ్లగూడెంకు చెందిన మనోహర లింగ స్వామి నిర్మించుకున్న ఇందిరమ్మ ఇల్లు గృహ ప్రవేశానికి భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి గురువారం ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే లబ్ధిదారులు లింగస్వామి కుటుంబానికి నూతన వస్త్రాలను అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ కార్యక్రమంలో భీమా నాయక్, పాశం సత్తిరెడ్డి, చిట్టెడి జనార్దన్ రెడ్డి, నూతి రమేష్, పలుసం సతీష్, గరిసె రవి, చిలుగూరి సత్తిరెడ్డి, కంకల కిష్టయ్య, సహదేవ్, బాలరాజు, భాస్కర్, మల్లేష్, ఎంపీడీఓ జలందర్ రెడ్డి, హౌసింగ్ ఈఈ నాగేశ్వర్, ఏఈ కిరణ్, పంచాయతీ కార్యదర్శి పాల్గొన్నారు.

బీఆర్ఎస్ హయాంలోనే నిధులు మంజూరు

యాదగిరిగుట్ట : బీఆర్ఎస్ ప్రభుత్వం ఉన్న సమయంలోనే యాదగిరిగుట్ట మున్సిపల్ నూతన భవనానికి నాటి సీఎం కేసీఆర్, పురపాలకశాఖ మంత్రి కేటీఆర్‌లు రూ.4కోట్లు మంజూరు చేశారని ఆ పార్టీ మండల అధ్యక్షులు కర్రె వెంకటయ్య అన్నారు. యాదగిరిగుట్టలో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సమావేశంలో ఆలేరు మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ గడ్డమీది రవీందర్ గౌడ్, నార్మూల్ మాజీ డైరెక్టర్ ఒగ్గు బిక్షపతి, బీఆర్ఎస్ జిల్లా నాయకులు మిట్ట వెంకటయ్య. ఆవుల సాయి, గంగసాని నవీన్, పాండవుల భాస్కర్ గౌడ్, బాబురావు, రాజేష్ ఉన్నారు.

వసతి గృహాల తనిఖీ



విద్యార్థులతో మాట్లాడుతున్న ఎం.భాస్కర్‌రావు

మోత్కూరు : మున్సిపల్ కేంద్రంలోని తెలంగాణ సాంఘీక సంక్షేమ బాలుర వసతి గృహం, వెనుకబడిన తరగతుల విద్యార్థుల సంక్షేమ వసతి గృహాలను గురువారం స్థానిక సంస్థల జిల్లా అదనపు కలెక్టర్ ఎం.భాస్కర్‌రావు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మెనూ సక్రమంగా నిర్వహిస్తున్నారా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. వర్షాకాలం సీజన్‌లో ఎలాంటి వ్యాధులు సంభవించకుండా తగు చర్యలు తీసుకోవాలని వార్డెన్లకు ఆదేశించారు. బీసీ బాలుర గృహంలో కిటికీ తలుపులు లేక పోవడంతో రాబోయే చలికాలం అని, తక్షణమే ఏర్పాటు చేయించాలని అదనపు కలెక్టర్ మున్సిపల్ కమిషనర్ కె.సతీష్‌కుమార్‌ను ఆదేశించారు.

నానో యూరియా వాడకంపై అవగాహన

ఆలేరురూరల్ : నానో యూరియాపై సత్ఫలితాలు పొందవచ్చని, ఖర్చు తగ్గి, అధిక దిగుబడి, భూసార పరిరక్షణ పర్యావరణ హితమని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వెంకట రమణారెడ్డి అన్నారు. గురువారం ఆలేరు మండలం బహద్దూర్‌పేటలో రైతులకు నానో యూరియా వాడకంపై వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడారు. రైతులకు నానో యూరియా వాడకంపై కలిగే ప్రయోజనాలు, నానో యూరియా వాడే విధానం గురించి వివరించారు. వాటిపైన రైతులకు ఉన్న సందేహాలను నివృత్తి చేశామన్నారు. 45కిలోల యూరియా బస్తాకు 500మిల్లీ లీటర్ల నానో యూరియా సమానం అన్నారు. ఈకార్యక్రమంలో మండల వ్యవసాయ శాఖ అధికారి శ్రీనివాస్, ఏఈఓ శాలిని, శివకుమార్, రైతులు స్వామి, రాజు, శేఖర్, పాల్గొన్నారు.

వలిగొండ : మండలకేంద్రంతో పాటు మల్లపెల్లిలో గురువారం వ్యవసాయ శాఖ అధికారులు నానో యూరియా, డీఏపీ వాడకంపై రైతులకు అవగాహన కల్పించారు. మండల వ్యవసాయ అధికారి అంజనీ దేవి మాట్లాడారు. నానో (ద్రవ రూప)యూరియా వినియోగంతో రైతులకు ఖర్చులు తగ్గుతాయని, 45కిలోల యూరియా బస్తా, 500ఎంఎల్ నానో యూరియాకి సమానమని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ లు శృతి, మహేష్, రైతులు కొలను వెంకట్ రెడ్డి, మల్గ వెంకన్న,మల్గ రాములు తదితరులు పాల్గొన్నారు.



ఆలేరు రూరల్ : బాహదూర్‌పేటలో అవగాహన కల్పిస్తున్న డీఏఓ వెంకట రమణారెడ్డి

మోత్కూరు : మండలంలోని పాటిమట్ల గ్రామంలో బండారు నర్సిరెడ్డి వ్యవసాయ క్షేత్రంలో నానో యూరియాపై అవగాహన కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారి వి.కీర్తి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఏఈఓలు ముప్పిడి అశోక్, ఆర్.సింహప్రసాద్, రైతులు బండ నర్సిరెడ్డి, దొండ దశరథ, బండ రవి, వెంకట్‌రెడ్డి, రాజు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి కృషి



స్పీకర్ బాక్స్‌ను అందజేస్తున్న పంజాబ్ నేషనల్ బ్యాంక్ బ్రాంచ్ మేనేజర్ స్వప్న

చౌటుప్పల్ : ప్రభుత్వ పాఠశాలలకు తమ వంతు సహకారం అందిస్తామని పంజాబ్ నేషనల్ బ్యాంకు బ్రాంచ్ మేనేజర్ స్వప్న తెలిపారు. పట్టణ కేంద్రంలోని బీసీ కాలనీలోని ప్రాథమిక పాఠశాలలకు బ్యాంకు ఆధ్వర్యంలో రెండు బీరువాలు, స్పీకర్ బాక్స్‌లను గురువారం బహుకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన ఎంతో మంది ప్రస్తుతం ఉన్నత స్థాయిల్లో ఉన్న విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తించాలన్నారు. గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసేందుకు దాతలు తమ వంతుగా ముందుకు రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంప్లెక్స్ ప్రదానోపాధ్యాయుడు కర్నె శివకుమార్, స్థానిక ప్రదానోపాధ్యాయుడు కంచర్ల హర్షవర్ధన్‌రెడ్డి, ఉపాధ్యాయులు ప్రభావతి, దుర్గాభాయి, పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత

రామన్నపేట : మండల కేంద్రానికి చెందిన గాదె రాములు గురువారం అనారోగ్యంతో మృతి చెందాడు. ప్రసన్నా రత్నాకర్ ఫౌండేషన్ చైర్మన్ వేమవరపు సుధీర్‌బాబు, సంస్థ సభ్యులు రూ.5వేల ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో మిర్యాల మల్లేశం, జాల అమరేందర్‌రెడ్డి, గాదె శ్రీకాంత్, బాసాని రాజు, గాదె నవీన్, నరేష్ పాల్గొన్నారు.

ఆత్మకూరు(ఎం) : మండలంలోని కూరెళ్లలో ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి హైదరాబాద్‌లోని ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బోయిని నాగరాజును గ్రామ మాజీ సర్పంచ్ భాష బోయిన ఉప్పలయ్య యాదవ్ గురువారం పరామర్శించారు. ఈ సందర్భంగా కేహెచ్‌ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అందజేసిన రూ.10వేల ఆర్థిక సాయంతో పాటు రూ. 15వేలు బాధితుడికి అందజేశారు.

అఖండ మహా మృత్యుంజయ యాగం

చౌటుప్పల్ : పట్టణ కేంద్రంలోని సోమనాథక్షేత్రం ఆధ్వర్యంలో గురువారం అఖండ మహామృత్యుంజయ యాగాన్ని నిర్వహించారు. కొంతకాలంగా ప్రతి నెల మాస శివరాత్రిని పురస్కరించుకొని ఈ యాగం నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా మాజీ కౌన్సిలర్లు కాంశెట్టి శైలజ, సందగళ్ల విజయలు వెండి పాదుకలను క్షేత్రానికి బహూకరించారు. ఈ కార్యక్రమంలో బడుగు మాణిక్యం, గట్టు ప్రభాకర్, అప్పిడి రాంరెడ్డి, నర్సింహ్మా, సావిత్రి, ఊర కృష్ణమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

అసెంబ్లీని తలపించేలా మున్సిపల్ భవన నిర్మాణం

- ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య

యాదగిరిగుట్ట : యాదగిరిగుట్ట మున్సిపాలిటీ నూతన భవనాన్ని అసెంబ్లీని తలపించే విధంగా నిర్మాణం చేయనున్నట్లు ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య అన్నారు. గురువారం యాదగిరిగుట్ట మున్సిపల్ నూతన భవన నిర్మాణానికి భూమి పూజను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సుమారు రూ.13వేల ఎస్ఎఫ్‌టీలో విశాలమైన భవనాన్ని నిర్మాణం చేయనున్నట్లు వెల్లడించారు. ఆలేరుకు గుండెకాయ లాంటి యాదగిరిగుట్ట ఆలయాన్ని, పట్టణాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తానన్నారు. 9కిలో మీటర్ల మేరా గుట్ట పట్టణంలో సీసీ, బీటీ రోడ్డు వేయనున్నట్లు వెల్లడించారు. అనంతరం పట్టణంలో మత్స్యకారుల కోసం రాష్ట్ర ప్రభుత్వం చెరువుల్లో చేప పిల్లలను వేసేందుకు జిల్లాకు రూ.2.8కోట్లను మంజూరు చేసినందుకు సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి వాకిటి శ్రీహరి, మెట్టు సాయికుమార్ ఫ్లెక్సీకి పాలాభిషేకం చేశారు. అనంతరం మందనపల్లి మహిళా మత్స్య పారిశ్రామిక సొసైటీకి సర్టిఫికెట్లు అందజేశారు. ఆయా కార్యక్రమాల్లో మున్సిపల్ కమిషనర్ లింగస్వామి, తహసీల్దార్ గణేష్ నాయక్, ఎంపీడీఓ నవీన్‌కుమార్ మున్సిపల్ మాజీ చైర్మన్ సుధాహేమేందర్, మాజీ కౌన్సిలర్లు గౌళికార్ అరుణరాజేష్, వాణిభరత్, మౌనికశ్రీధర్, మమత సాయి, సీస విజయలక్ష్మీకృష్ణ, సురేందర్, మల్లేష్, కోఆప్షన్ సభ్యులు పెంటయ్య పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

మోటకొండూర్ : నిరుపేద ప్రజల సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుందని ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య అన్నారు. గురువారం మండల కేంద్రంలోని మహాలక్ష్మీ ఫంక్షన్ హాల్‌లో అర్హులైన లబ్ధిదారులకు కొత్త రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వీరారెడ్డి, ఆర్డీఓ కృష్ణరెడ్డి, తహసీల్దార్ నాగదివ్య, ఎంపీడీఓ ఇందిర, పచ్చిమట్ల మాదార్‌గౌడ్, మల్లేష్, రంగయ్యగౌడ్, భాస్కరుణి రఘునాథరాజు ఉన్నారు.



యాదగిరిగుట్ట : మున్సిపల్ భవన నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న విప్ బీర్ల ఐలయ్య

అర్హులైన ప్రతి ఒక్కరికీ రేషన్ కార్డు

ఆత్మకూరు(ఎం): అర్హులైన ప్రతి ఒక్కరికీ రేషన్ కార్డు అందజేయడమే ప్రభుత్వం లక్ష్యంగా పనిచేస్తుందని ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య అన్నారు. గురువారం మండల కేంద్రంలోని జేఏఎస్ పంక్షన్ హాల్‌లో రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ వీరారెడ్డి, ఆర్డీఓ కృష్ణారెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ జిల్లాల శేఖరరెడ్డి, తహసీల్దార్ లావణ్య, ఎంపీడీఓ జె. రాములు నాయక్, మాజీ ఎంపీపీ తండ మంగమ్మ, మాజీ జెడ్పీటీసీ నరేందర్‌గుప్తా, మాజీ సర్పంచ్ నగేష్, పీఏసీఎస్ డైరెక్టర్ వెంకట్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు యాస లక్ష్మారెడ్డి, అనంతరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భద్రత కల్పించాల్సిన బాధ్యత యాజమాన్యాలదే



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న కలెక్టర్, డీసీపీ

భువనగిరిటౌన్ : పని ప్రదేశంలో మహిళలందరికీ సురక్షితమైన వాతావరణాన్ని కల్పించాల్సిన బాధ్యత యజమాని, యాజమాన్యాలదేనని కలెక్టర్ హనుమంతరావు అన్నారు. యాక్షన్ ఎయిడ్ కమ్యూనిటీ ట్రైనర్ సురుపంగ శివలింగం విజ్ఞప్తి మేరకు పోష్ చట్టం పుస్తకాలు, వాతావరణ మార్పులపై అవగాహన కల్పించేందుకు ముద్రించిన కరపత్రాలు కలెక్టరేట్‌లో కలెక్టర్ హనుమంతరావు, డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ ఆకాంక్ష్‌యాదవ్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కరరావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అసంఘటిత రంగంలో పనిచేస్తున్న మహిళా కార్మికులు, ప్రభుత్వ మహిళా ఉద్యోగులకు ఈ చట్టంపై అవగాహన కార్యక్రమాలు చేపడుతున్న యాక్షన్ ఎయిడ్ కర్ణాటక ప్రాజెక్టు సంస్థను ఈ సందర్భంగా అభినందించారు. జిల్లాలో అన్ని సంస్థల్లో అంతర్గత కమిటీలు ఏర్పాటు తప్పనిసరిగా చేయాలని సూచించారు. కార్యక్రమంలో అధికారులు పాల్గొన్నా రు.

కాలరెగరేసిన రైతు.. కాళ్లు పట్టుకుంటున్నాడు



మాట్లాడుతున్న గొంగిడి సునిత

యాదగిరిగుట్ట : బీఆర్ఎస్ అధికారంలో ఉన్న పదేళ్ల కాలంలో దర్జాగా కాలరెగరేసి వ్యవసాయం చేసిన రైతు.. నేడు అసమర్థ రేవంత్‌రెడ్డి పాలనలో యూరియా కోసం కాళ్లు పట్టుకునే దుస్థితి వచ్చిందని ఆలేరు మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునిత అన్నారు. యాదగిరిగుట్టలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. గత బీఆర్ఎస్ పాలనలో కేసీఆర్ రైతుల పంటలను దృష్టిలో పెట్టుకొని ఆరు నెలల ముందే బఫర్ స్టాక్ తెప్పిస్తే.. ఇప్పుడున్న కాంగ్రెస్ ప్రభుత్వ సీఎం రేవంత్‌రెడ్డి సీజన్ మొదలై ఆరు నెలలు కావొస్తున్న ఇప్పటికీ యూరియా తీసుకురాకుండా మొద్దు నిద్రలో ఉన్నారని విమర్శించారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై బురద జల్లడంలో పెట్టిన సమయం, ఎరువులు తెప్పించడంలో పెట్టి ఉంటే ఇవాళ్ల రైతులకు ఇంత దుస్థితి వచ్చేది కాదన్నారు. యూరియా కొరతలో కాంగ్రెస్, బీజేపీ దొందు దొందేనన్నారు. కేంద్రం నుంచి యూరియా కరెక్ట్ గానే వస్తుందని, రాష్ట్రానికి వచ్చాక ఏమవుతుందో తెలియదని బీజేపీ అధ్యక్షుడు రాంచంద్రరావు చెప్పడం పై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయన్నారు. రాష్ట్రంలో యూరియా కొరతను తీర్చేందుకు రేవంత్ రెడ్డి ఢిల్లీలో ఆమరణ దీక్ష చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ పార్టీ మండలాధ్యక్షుడు కర్రె వెంకటయ్య, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ గడ్డమీది రవీందర్ గౌడ్, నార్మూల్ మాజీ డైరెక్టర్ ఒగ్గు బిక్షపతి, నాయకులు అవుల సాయి, గునగంటి బాబురావుగౌడ్, గంగసాని నవీన్, భాస్కర్, రాజేష్, బాలసిద్దులు తదితరులున్నారు.

బోనమెత్తిన పల్లెలు



రామన్నపేట : నీర్నెములలో బోనాలతో వెళ్తున్న మహిళలు



గుండాల : మాసాన్‌పల్లిలో బోనాలు తీసుకెళ్తున్న మహిళలు

జాగ్రత్తలు పాటిస్తే పంటలను కాపాడుకోవచ్చు

భువనగిరి : రైతులు జాగ్రత్తలుపాటించడం ద్వారా పంటలను కాపాడుకోవచ్చని తెలంగాణ రైతు విజ్ఞాన భువనగిరి కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ అనిల్‌కుమార్ అన్నారు. గురువారం మండలంలోని కూనూరు, చీమలకొండూరు, చందుపట్ల, వీరవెల్లి గ్రామాల్లో జీవ నియంత్రణ విభాగం సీనియర్ శాస్త్రవేత్త రామకృష్ణ బాబుతో కలిసి వరి, పత్తి పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. వారం రోజుల నుంచి ఎడతేరిపిలేకుండా కురుస్తున్న వర్షాల వల్ల వరి పంటలో నిల్వ ఉన్న నీటిని తోలగించుకోవాలన్నారు. అగ్గితెగులు అశించకుండా పోలం గట్ల పై పోలంలో కలుపులేకుండా చూసుకోవాలని చెప్పారు. వరి నాటి కోన్ని రోజులకు కలుపు మొక్కల నివారణకు, కాండం తోలుచు పురుగు నివారణకు చర్యలు తీసుకోవాలన్నారు. పత్తి పంటలో నిలిచిన వర్షపు నీటిని తోలగించిన తర్వాత ఎకరానికి రెండు కిలోల యూరియా లేదా 4 కిలోల డీఏపీని పిచికారి చేయాలని చెప్పారు. ప్రస్తుతం పత్తి పంటను ఆశిస్తున్న రసం పీల్చే పురుగులైన పచ్చదోమ, తెల్లదోమ, తామర పురుగు మరియు పేనుబంక నివారణకు ఎకరానికి ఒక లీటరు 1500 పీపీఎం వేపనూనే లేదా 60 గ్రాముల ఫ్లోనికామిడ్‌నీటిలో కలిపి పిచికారీ చేయాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విశ్వవిద్యాలయం విద్యార్థులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

లింగాకర్షణ బుట్టలతో మేలు

గుండాల : పత్తి పంటలలో గులాబీ రంగు పువ్వులను అరికట్టడానికి రసాయనాలు వాడకుండా ఎకరాకు 8 లింగాకర్షణ బుట్టలు ఏర్పాటు చేస్తే ఎంతో మేలు జరుగుతుందని ఏఓ సూరజ్‌కుమార్ రైతులకు సూచించారు. గురువారం మండలంలోని వస్తాకొండూర్ గ్రామంలో లూయిస్ డ్రెప్రస్ కంపెనీ ఆధ్వర్యంలో మోడర్న్ ఆర్కిటెక్స్ ఫర్ రూరల్ ఇండియా ఆధ్వర్యంలో క్షేత్ర స్థాయిలో పత్తి పంటను పరిశీలించారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ రైతులకు శాస్త్రీయ పద్ధతులు, ముందస్తు జాగ్రత్తలు, సమర్థవంతమైన నియంత్రణ మార్గాలపై వివరించారు. పత్తి పంటను కాపాడుకోవడానికి లింగాకర్షక బుట్టల యొక్క ప్రాధాన్యతను వివరించారు. పత్తి పంటలలో అధిక దిగుబడులు సాధించిచేందుకు రసాయన ఎరువులను తగ్గించి సేంద్రీయ పద్ధతిలో సాగు చేస్తే లాభసాటిగా ఉంటుందని చెప్పారు. అనంతరం ఉచితంగా రైతులకు లింగాకర్షక బుట్టలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఈవో శ్రీశైలం, ఎల్‌డిసి ప్రతినిధి అఖిలేష్, మారి సంస్థ పియూ మేనేజర్ మల్కాపురం ప్రమోద్, కోఆర్డినేటర్ నరేష్, పాలడుగు మహేష్, తిరుపతి, గణేష్, అనిల్‌కుమార్, శిరీష, మనోజ్ పాల్గొన్నారు.



గుండాల : వస్తాకొండూర్‌లో లింగాకర్షణ బుట్టలు పంపిణీ చేస్తున్న ఏఓ సూరజ్‌కుమార్

కొనసాగుతున్న కేవీఎస్ నేషనల్ యోగ స్పోర్ట్స్ మీట్

భువనగిరి : పట్టణ శివారులోని పీఎంసీ కేంద్రీయ విద్యాలయంలో గురువారం కూడా 54వ కేవీఎస్ నేషనల్ యోగ స్పోర్ట్స్ మీట్-2025 పోటీలు జరిగాయి. ఇందులో భాగంగా అండర్-14 విభాగంలో సెమిఫైనల్ ట్రెడిషనల్ యోగాసనాల పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ చంద్రమౌళి, ప్రధాన కార్యదర్శి నందన కృపాకర్, తోట సతీష్,సంధ్యా పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

రామన్నపేట : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఖాళీగా ఉన్న వాణిజ్యశాస్త్రం అతిథి అధ్యాపక పోస్టుకు అర్హత గల అభ్యర్థులు ఈనెల 23వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని ఆ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రాహత్‌ఖానం గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సంబంధిత సబ్జెక్ట్‌లో జనరల్, బీసీ అభ్యర్థులు పీజీలో 55శాతం, ఎస్సీ, ఎస్టీలు 50శాతం మార్కులు ఉండాలని పేర్కొన్నారు.

అనంతారంలో వైద్యశిబిరం

గుండాల : మండలంలోని అనంతారం గ్రామంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో గురువారం ఉచిత వైద్యశిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎంఎల్‌హెచ్‌పీ యమున సూచించారు. అకాల వర్షాల కారణంగా జ్వరాలు, జలుబు, దగ్గు ఉన్న వారిని గుర్తించి పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు.